


శ్రీ. శ్రీ. (కవితాసమితి)

ఆ యుదయమున మధుసూదనుఁ డాలోచనాయత్తచిత్తుఁడై యుండెను. అట్టిసమయమున నే నట కేఁగితిని.

"వానిని గాంచితివా?" యని నన్నతఁ డడిగెను.

గుమ్మము దాఁటిపోవుచు నొక మధ్యవయస్కుఁడు నా కగపడియెను. అతఁడేకదా యని "చూచితి" నని ప్రత్యుత్తర మిచ్చితిని.

"ఆతనిఁగూర్చి యేమి గ్రహించితివి?"

"నాకంటికి మిక్కిలి దీనునివలెఁ జూపట్టెను. అతనిని జూచిన నే హృదయము కరఁగిపోవును. వ్యర్థజీవి యనవచ్చును."

"సత్యమే! కాని, యనంతా! జీవితమే వ్యర్థముకాదా? ఇతఁడు దీనుఁడనుటకు సందేహమేమి? వీనిచరితము వింటివేని, ఇంతటి దౌర్భాగ్యుఁ డుండఁబోఁడని నీవే పల్కుదువు. ఐనను వీనికి నేనేమి సహాయము చేయఁగలను? సంగతులేనియు విశదము కావయ్యెను. ఇతఁడు చెప్పిన దానిలో నేడుపుతక్క నెక్కుడు లేకుండెను!"

నాకుఁ గుతూహలమయ్యెను "ఈతఁడు నీ సహాయార్థియా?" యంటిని.

"అట్లే యనవచ్చును. తనకథ చెప్పి పోలీసువారి సహాయ మపేక్షింప వారీతనిని నాయెడ కంపిరి. ఇంతవఱ కాతఁ డేదో మొఱ్ఱపెట్టు కొనుచు నిప్పుడే, నేను వానివిషయమై మనఃపూర్తిగఁ బనిచేయఁదలంచితినని పల్కినపిమ్మట, వెడలిపోయినాఁడు."

"సరియే! వానికథ యేమి?"

"వినుము. ఈతనిపేరు సుబ్రహ్మణ్యము. ధనికుఁడనుట నిర్వివాదాంశము. వయస్సేఁబదియాఱేండ్లు. రెండుసంవత్సరముల వెనుక భార్య పోవుటచే పునర్వివాహము చేసికొనెను. ఇతని కాపురస్థల మనకాపల్లి.

వర్తక వ్యాపారమున నతఁ డింతటిధనము గడించెను. కాని యిటీవల నారోగ్యము చెడి

పోవుటచే సుప్రశాంతిఁగోరి యనకాపల్లికివచ్చి యక్కడనే సుఖజీవన మొనర్పఁ జొచ్చెను. అపారమగుధనము, అభినవ యౌవనవతియగు భార్య, అవసరమున్నంత విశ్రాంతియుఁగలిగి యత్యంత ధన్యజన్ముఁడనని యానంద మొందుచుండెను. కాని యచిరకాలములో నీవిపుడు చూచుచున్నటులు దీనులలో దీనుఁడై, హతాశులలో హతాశుఁడై, నిర్భాగ్యులలో నిర్భాగ్యుఁడయిపోయినాఁడు. పాపము! వ్యర్థజీవియై పోయినాఁడు."

"అందులకుఁ గారణమేమి?"

"ఏమి చెప్పవలెను! విశ్వాసహీనుఁడగు మిత్రుఁడు! కుటిలవర్తనియగు భార్య! సుబ్రహ్మణ్యమున కితరదుర్గుణములు లేవు కాని చతురంగమన్నమాత్రము చెవి కోసికొనుచుండును. అనకాపల్లిలో నానందరావొకఁడు కలఁడు. వీ రిరువురకును జతురంగమునఁ బరిచయముకల్గి క్రమక్రమముగ దృఢమైత్రియై పరిణమించినది. ఆనందరావనవరతము వారియింటికి వచ్చి పోవుచుండును. ఇఁక నితనిభార్యతోడ నానందునికి సంపర్కము కల్గెనన్న వింతయేమి? ఇర్వురునుగూడి వారమురోజుల వెనుక నొకరాత్రి పలాయితులైరి. ఎక్కడికేఁగిరో ఎఱుకపడకుండెను. అతనిభార్య తనతోఁగూడ ధనమును తీసికొనిపోయినది. మనమిఁక చేయునదేమి? ఆకాంత పట్టువడునా? ధనము మరలదొరకునా? ఇదియే సమస్య. చూపులకు సాధారణముగ నేకన్పట్టుచున్నది."

"నీవేమి చేయఁదలఁతువు?"

"నేనేమియుఁ జేయఁ దలఁచుకొనలేదు. నా కింకొక యవసరకార్యమున్నది. ఈ రహస్యమును భేదింపఁ గుతూహలమగుచుండెను. కాని నేనటకేగవలయును. కావున మిత్రమా, నీకిది కష్టముకాకున్న నొక్కసారి యనకాపల్లికి వెళ్లఁ గోరెదను. సుబ్రహ్మణ్యము నన్నే రమ్మనెను కాని యితరకార్యావసరమున నేఁగఁజాలక నిన్నంపుదునని చెప్పఁగా సమ్మతించినాఁడు. ఇఁక నీవువెళ్లకతీరదు. చని దొరకినన్ని సూత్రముల నేకరింపవలెను."

"అభ్యంతరమేమి? నా సర్వశక్తులను వినియోగింపఁ దలఁచుకొన్నాను."

ఇట్లు పలికి బయలుదేరితిని. బయలుదేరితినేకాని నే నేఁగెడుకార్యమునుగూర్చి వారము దినములలోపున మండలమంతయు మాఱుమ్రోఁగనున్నదని కలనైనఁ దలఁపలేదు.

మఱునాఁడే తిరిగివచ్చితిని. మధుసూదనరావు వాలుకుర్చీమీఁదఁ గూర్చుండి యుండెను. నేను నొక యాసనముమీఁద నాసీనుఁడనైతిని. నేను వెళ్లినపని నెఱవేర్చుకొంటినని పలికి యతని కోరికమీఁద సంగతి నిట్లని తెలియఁ జెప్పితిని:

"పొగబండిమీఁద పోయి సాయంకాలమగునప్పటి కనకాపల్లి చేరితిని. సుబ్రహ్మణ్యమొకతోఁటను, అందలి యింటిని కొని కాఁపురమున్నాఁడు. అది తోఁటయన్నమాటయేకాని

అంతయు చీదరగనే యుండెను. ఏవో వృక్షములున్నను అవి కాఁపరిలేని కారణమున దైవికముగఁ బెరుఁగుచుండెను. ఎన్నియోతీఁగలు దట్టముగ నల్లుకొనియున్నవి. ఒకచిన్నయటవివలెనున్న యాతోఁట నరసి సుబ్రహ్మణ్యమునకు శ్రద్ధలేదని యనుకొంటిని.

"తోఁటకుఁజుట్టు నొకగోడ కలదు. అది మిక్కిలి యెత్తైనది. అదియుఁగూడ శిథిలావస్థలోనే యుండెను. పెంకుతోఁగట్టఁబడి యక్కడక్కడ నాచుతోడనిండి మిక్కిలి జుగుప్సాకరముగ నుండెను. చాలచోట్ల సున్నమూడి నిజస్వరూప మగపడుచుండెను. ప్రదేశమంతయు నిర్జనమై భయంకరముగ నుండెను. మఱియు నందందు——"

"ఆవర్ణనముల కేమిలే! ప్రస్తుతాంశముఁ దేల్పుము. అతని యావాస మొక నిర్జనప్రదేశమునఁ దోఁటలోఁ గలదు. మఱి?"

"అతని యిల్లిదియని నాకుఁ దెలియకపోయియుండును; కాని, దారిలోని యొక పురుషు నడిగి తెలిసికొంటిని. అతనిని దెల్పుటకుఁ గారణ మున్నదిలే! కోరమీసములు కల్గి యతఁడు సన్నగా పొడవుగా నుండెను. చామనచాయ మేను. కొంచెము విసువుతో నింటిదెస వ్రేలు చూపెను.

"ఆవైపున తోఁటనుండి యొకసన్నని బాట కలదు. దానిమీఁదుగ నిల్లుసేరితిని. అది యింటికి వెనుకదారి. అల్లేఁగినను నాకక్కడనే సుబ్రహ్మణ్య మగపడియెను.

"అక్కడ నెన్నియో చిన్నగదు లుండెను. ఒకగదిముందు నా కతఁడు కనఁబడెను. అతని కన్నులెఱ్ఱబారి యుండెను. చేతులు కంపించుచుండెను. అట్టి యా దీనస్థితిఁ జూడ నాకు జాలి యయ్యెను. అది యేమోకాని యతనిచూపులలోఁ గ్రౌర్యము తాండవించుచుండెను."

"బాగుబాగు, అతఁ డేమనును?"

"అదేవిధముగఁ దనదుఃఖచరిత్రము నేకరువు పెట్టెను. నేను వినఁజాలకుంటిని. అతఁడు పరిపరివిధముల భార్యను,మిత్రునిదూషించుచు, 'మనుష్యస్వభావ మెట్టిది! దానికి నేనేమి తక్కువచేసితిని? కోరిన దేమి లేదంటిని? అయినను నన్ను కూల్చివేసిన దే! ఆమిత్రుఁడో! ఎంత యోగ్యముగఁజూపట్టెను? ఎంతనీచుఁడుగఁ బ్రవర్తించెను! ఛీ! ఇఁక లోకమున నెవ్వరిని నమ్మనగును' అని చింతించుచుండెను.

"ఈలోపున నేనాయింటిని బరీక్షింపఁ జాలితిని. తోఁటమాటఁ జెప్పితినికదా! ఇల్లుకూడ నదే వైఖరి. ఆ ప్రదేశమెల్లను ధూళిధూసరితమై యుండెను. ఎల్లయెడల పట్లుపట్టి యుండెను. గోడలుకూడ నేనాఁటినుండియో సున్నములులేక పాడుపడియుండెను. పాపము సుబ్రహ్మణ్యము చేయున దేమి? ఇంటిదుఃస్థితినరసియే కాఁబోలు నాతఁడు నేనేఁగుసరికి తలుపులకు రంగువేయుచుండెను. ఆవాసన భరింప శక్యము కాకుండెను. కాని రంగులుమాత్రము ప్రశస్తమైనవి.

"యథాప్రకారముగ నాతఁడు తనపాట సాగించెను. నేనాతని నోదార్చుచు ముఖ్యాంశములను గ్రహింపఁజొచ్చితిని. ఆరాత్రి తాను, ఆనందుఁడును నాటకమునకుఁ బోఁదలంచిరఁట. ముందే టిక్కెట్లు కొని యుంచుకొనిరఁట. కాని యాకస్మికముగ నానందరావేదో సాకుచెప్పి వెళ్లుట మానెను. కావున తానొక్కఁడే వెళ్లవలసి వచ్చెను. నాటకమునుండి తిరిగివచ్చునంతట నతనికిఁ బంజరకీరము పలాయితమయ్యెనని బోధపడియెను. అతఁ డిట్లని నాకు వాడని టిక్కెట్టుకూడ చూపినాఁడు."

"ఆఁ! అట్లుచేసెనా? చెప్పుము. చెప్పుము. దైవికముగ నాటిక్కెట్టు సంఖ్యనుకూడ గుర్తింపలేదుకద!"

కొంచెము గర్వముతో "చూచితి"నంటిని. "అది నాచిన్నప్పటి బడియంకె యగుటచే జ్ఞాపక ముండిపోయెను. అది యిరువదియైదు."

"అట్లయిన ననంతా! సుబ్రహ్మణ్యము కూరుచున్నది యిరువదినాల్గవదో, ఇరువదియాఱవదో కావలయును."

"అవునవును, పైకథ వినుము. సంభాషణము ముగిసిన పిమ్మట నాతఁడు బల్లమీఁది కాగితములలో నగపడుచున్న ఛాయాపటము నొకదానినితీసి కోపముతో చింపివేయుచు, 'ఛీ! ఛీ! ఇఁక నాదుష్టురాలి ముఖము చూడ' నని యఱచెను. నేనాతనిస్థితికిఁ జింతించితిని. పిదప పోవుదునని పల్కి మరలి వచ్చితిని."

"ఉండు ముండుము. అతఁడు రంగువేయుచున్నాఁడని కాదా పల్కితివి? ఎక్కడ?"

"ఆగదితలుపులకు, కిటికీలకు వేయుచుండెను. నేనేఁగుసరి కొకటి రెండు పూర్తియైనవి."

"కాని యిది నీ కాశ్చర్యదాయకము కాలేదా? రాత్రి యేమగంటలకు రంగులు వేయుచుండు టేమి? ఏమందువు!"

"అది చిత్రమే! కాని యతఁ డింకను చిత్రపు మనిషి. భార్యచిత్రమును జింపుటమాత్రము చిత్రము కాదా! అదియుఁగాక వానికి వేఱొక పని యేదియుఁ దోఁచుట లేదు. మనసు త్రిప్పుకొనుట కేదైన చేయవలదా?"

"సరే! మఱేమయిన చెప్పవలసినది కలదా?"

"కలదు: ముఖ్యమైన దదియే! నేనురైలెక్కునంతట సరిగా నాకు దారిచూపిన మనుజుఁడే తానుకూడ ప్రక్కబండిలోని కెక్కినాఁడు. ఆముఖము, ఆమీసములు, ఆకోర చూపులు——

"ఆ బంగారు సులోచనములు, ఆకుక్కమూతిచేతికఱ్ఱ——"

"ఓహో! అనూన ప్రజ్ఞానిధి వగుచున్నావే! అది నీ వెట్లు గ్రహించితివి?"

"దానికేమి కాని ప్రస్తుతమునకు రమ్ము. అనంతా! ప్రప్రథమమున నీరహస్యము సులభభేద్య మనుకొంటిని కాని రానురాను మిక్కిలి యగాథ మగుచున్నది. నిజముగా నీవు పని నెఱ

వేర్చితివి. కాని కొన్ని ముఖ్యవిషయముల గమనింపవైతివి సుమా?"

"నే నేవైన మరచితినా?"

"అనంతా! చిన్న పువ్వుకొనకుము. నీవానర్చినపని యమోఘమైనదియే! అట్లయ్యుఁ గొన్ని ముఖ్యాంశములను వదలివేసితివి. ఇటు చూడుము. ఆదంపతులఁ గూర్చి జనులయభిప్రాయ మేమి? ఇది ముఖ్యమందువా? ఆనందునిగూర్చి వా రేమనుకొందురు? అతని వర్తన మెట్టిది? ఇవి యవసరములుకదా! ఎవ్వరిని కనుఁగొన్నను తెలిసిపోవునే! వీనిని నీవరయక పోతివి."

"కాని యింకను చేయిమించుటలేదుకదా! వానిని గనుఁగొనవచ్చును."

"కనుఁగొనఁబడినవి. తంతిమూలమునను, పోలీసువారి సహాయమునను నా కన్ని సంగతులు నిల్లుకదలకుండ చేతి కందుచుండును. వాస్తవముగ నే గ్రహించినదానివలన సంగతులు స్థిరపడినవి. ఈ సుబ్రహ్మణ్యము లోభియని ప్రతీతి కలదు. భార్యను కష్టపెట్టుచుండుననియు ననుకొనుచుందురు. ఆనందుని సంగతియు నవగతమైనది. ఇఁక నేఁటి కీపని చాలును. తరువాత చూచుకొంద" మని మధుసూదనుఁడు వేళ యతిక్రమించుటచే భుజింపనేఁగెను. నేనును గృహోన్ముఖుఁడ నైతిని.

## 3

ఆమఱుదినమున నేనొంటరిగ నింటఁ గూర్చుండియుంటిని. అంతలో నొకపిల్లవాఁడు మధుసూదనుని యొద్దనుండి యొకలేఖ తెచ్చి నా కొసఁగెను. అం దిట్లుండెను:

"మిత్రుఁడగు ననంతరావునకు—

"రహస్యము పూర్తికావచ్చినది. తెలిసికొనవలసిన యంశము లిఁక నొకటి రెండుకంటె నధికము లేవు. ఆపిమ్మట నిది భేదింపఁబడినట్లే! ఈలోపున నీవు నేఁటిమధ్యాహ్నము మూఁడు గంటలకు మాయింటికి రాఁగోరెదను.

—మధుసూదనరావు."

సరిగా మూఁడుగంటల కాతని యింటికిఁ బోయితిని. మధుసూదనుఁడు మేడమీఁద నుండెను. అట కేఁగితిని. ఏవో ప్రశ్నలు వేయుచుంటిని. కాని జవాబులు రాలేదు.

అంతలో సుబ్రహ్మణ్యము వచ్చియున్నట్లు తెలిసెను. మధుసూదనుఁ డాతనిని మీఁదికి రావించెను. రొజుకొనుచువచ్చి యతఁడు "మధుసూదనరావుగారూ! నా కీ తంతి వచ్చినది. నమ్ముటో నమ్మకుండుటో తెలియకున్నది." యని పల్కుచుఁ దంతి నిచ్చెను.

"వెంటనే వచ్చితివేని నీవు కోల్పోయిన వానిని బడయఁగలవు. జాగుచేయరాదు.

—కరణము రామలింగము, కశింకోట"

దానినిచదివి మధుసూదనరావు "సరే! మీ రిప్పుడు కశింకోటకుఁ బోవుఁడు. నాల్గు గంటలకు రైలున్నది." యనియెను.


కాని సుబ్రహ్మణ్య మేఁగుట కిష్టపడినట్లు లేదు. అతని కాతొందరయే లేకపోయెను. "ఎందుకండీ! ఇదియంతయు తంత్రము! మీఁదు

మిక్కిలి డబ్బుదండుగ! వృథాకాలయాపనము! నాభార్యఁగూర్చి యీ రామలింగని కేమి తెలియును?" అని యతఁడు పల్కుచుండెను.

"ఏమిది? అతని కేమియుఁ దెలియకున్న తంతివార్త నెందుల కంపును? మీ రేఁగవలయును."

"నే నేఁగవలసిన యగత్య మున్నట్లు తోఁపదు."

మధుసూదనునకుఁ బట్టరాని కోపము వచ్చెను. "అయ్యో! ఇదిగో వినుఁడు. ఇట్టి బలవత్తర మగు సూత్రము దొరకుచుండ మీరు దానిని సంగ్రహింపక పోయినచో వ్యర్థముగ చిక్కులు కల్గును. మీ కిందు పట్టుదలయే లేన



ట్లు తోఁచును. కావున నిదియే నాశాసనము. మీరు వెళ్లక తీరదు!"

ఈ మాటలను విని యాతఁడు కొంచెము జంకెను. "మీ రిట్లనిన-చో నే నడ్డు చెప్పఁగలనా? కాని వృథాశ్రమ!" యనుచుండ "ఆసంగతి నాకుఁ దెలియును. మీరు తత్క్షణమే బయలు దేరుఁడు!" అనియు మధుసూదనుఁ డడ్డుగఁ బల్కెను. ఎట్టకేల కతఁ డిష్టము లేకున్నను నిందుల కంగీకరించెను.

మధుసూదనరావు నన్ను రహస్యముగఁ బిల్చి, "ఓయీ! మీరిరువురును గలిసి కశింకోటకు పొండు. ఈ పని యెంతయు ముఖ్యమైనది. ఒక్కక్షణమైన నీతని నెడఁబాయకుము. వింతలున్న వెంటనే తంతినంపుము. ఇక్కడ నెక్కడనున్నను నాకది యందు నట్లు కట్టుబాట్లు చేసికొనియెదను." అని యాతనికి సాయముగ నన్నంపెను.

సాయంకాలపు బండిమీఁదఁ గశింకోటకుఁ బోయితిమి. కష్టపడి కరణముగారియిల్లు కనుఁగొంటిమి. మారాక నెఱింగింప నతఁడు గౌరవ పురస్సరముగ మమ్ము లోనికిఁ దోడ్కొనిపోయెను. పిమ్మట మేము వచ్చిన కార్య మేమని ప్రశ్నించెను.

"తా మంపిన తంతిని జూచుకొని వచ్చితి" మని నే నంటిని.

"నాతంతియా? నే నేదియు నెవ్వరికి నంపలేదే!"

"లేదా? ఈసుబ్రహ్మణ్యముగారికి నేఁడంపిన తంతిమాటయేమి?" యని దానిని జూపితిని.

"ఇది హాస్యమేయైన నాలోచింపఁదగినదే! ఎంత ధూర్తకృత్యము!"

నేనును సుబ్రహ్మణ్యము నొకరిమొగ మొకరము చూచుకొంటిమి.

"మీ పేరుకలవా రింకెవరైనఁ గలరా? కరణము లిర్వు రుందు రేమో! మేము పొరఁబడి యుండవచ్చును." అని నే నంటిని.

"పొరపాటు లేదు-గిరపాటు లేదు. పొండు పొండు. ఇది యబద్ధపుఁదంతియైనఁ బోలీసువారే కలరు! మీరిఁకపోవచ్చును." అని మ మ్మతఁడు సాగనంపెను.

జరిగినదంతయుఁ దంతిమూలమున మధుసూదనునికిఁ దెలియఁజేసితిని. అంతయు నతి విచిత్రముగ నున్న దనుకొంటిని.

సుబ్రహ్మణ్యము లుబ్ధుఁడనుటకుఁ దగినవాఁడని నేఁడు గ్రహించితిని. మొదట రైలు ఖర్చులకు మూలిగి మూఁడవతరగతిలోఁ బోవ నిశ్చయించెను. ఇప్పుడు పూఁటకూటి ఖర్చులకు గొణుగుకొనఁజొచ్చెను. ఎట్లో నాఁటి రాత్రి గడచినది. మధుసూదనుఁడు మమ్ముల ననకాపల్లికి రమ్మని తంతి నంపెను.

౪


ఆమఱునాఁ డనకాపల్లి చేరితిమి. వృథా ప్రయాస మయ్యెనుకదా యని సుబ్రహ్మణ్యామాడినమాట లిన్నియన్ని కావు. ఎట్లో మేమాతని యింటి కేఁగితిమి.

ఇంటిలో నున్నవారినిజూడ నాకాశ్చర్యమయ్యెను. అక్కఁడ మధుసూదనుఁ డొక్కఁడే కాక వెనుక నేఁ జూచిన కోరమీసములవాఁడు కూడ నుండెను.

మధుసూదనరావు లేచి "సుబ్రహ్మణ్యముగారూ! ఇతఁడు నామిత్రుఁడగు శ్యామసుందరరావు. ఇతఁడుకూఁడ మీవిషయమై పని చేయుచుండెను. అయిననేమి! మాయిరువురియూహ లేకీభవించియేయున్నవి. ఇద్దఱముకూడ నొక్క-ప్రశ్నమునే యడుగనుంటిమి" అనెను.

వ్యస్తహృదయుఁడై సుబ్రహ్మణ్యము కూర్చుండెను. కాని యతని ముఖమున ననుమానచిహ్నములు ద్యోతకములగుచునేయుండెను. ఏదో చేయుమించిన పని జరుగనున్నదని యతఁడు పసిపట్టెను. తడఁబడుచునే యతఁడు "మీ రడిగెడునది యే" మనియెను.

"ఇది! ఆకళేబరముల నేమిచేసితిరి?"



సుబ్రహ్మణ్యము దిగ్గున నెగిరిపడియెను. అతనిచేతులు గాలిలో నెగయుచుండెను. ముఖలక్షణములు వర్షాకాల మేఘములట్లు క్షణక్షణము మార్పుచెందుచుండెను. నోరు వెళ్లఁ

బెట్టి కఠోరముగ నఱచుచున్న యతఁడు మూర్తీభవించిన బీభత్సరస మేమోయన నొప్పెను. అతని నిజస్వరూప మప్పు డవగతమైనది. వక్రదేహుఁడే కాక వక్రమానసుఁడనికూడ బోధపడినది. ఒక ఘోరరాక్షసునివలె నతఁడు ముందున కుఱికెను.

అతఁడు బలవంతుఁడే కాని పేరెక్కిన నిరూపకు లిర్వురిముం దాతని యాటలు సాగవయ్యెను. కొంతవఱకు పెనఁగులాడిన పిమ్మట నతఁడు స్వాధీనుఁ డయ్యెను. శ్యామసుందరుఁ డాతనిని ఠాణాకుఁ దీసికొనిపోయెను.

కొంతసేపటికి రక్షకభటాధికారి యాప్రదేశమునఁ గాలిడెను. "హత్యలు జరిగినవా?" యని యాతఁ డాశ్చర్యమును సూచించెను. మేమందఱ మింటిమధ్యగదిలో నాసీనులమై యుంటిమి. మధుసూదనుఁడు నన్నుఁ గాంచి, "అనంతా! శ్యామసుందరుఁడుకూడ సుప్రసిద్ధ నిరూపకుఁడే! మొదట నీ వతనిని గొంతవఱకు వర్ణించిన పిమ్మట తెలిసిన నేను మిగిలిన దానిని పూర్తిచేసిన వింతయేమి?" అనెను.

రక్షకభటాధికారియగు రామచంద్రరావు "అయ్యా! మీ రనంత ప్రజ్ఞాధురీణులు. కాని మీ రీరహస్యమును భేదించుటచే నాకు రావలసిన బహుమతి పోవుచున్నది. ఇందులకుఁ జింతయు, హంతకుఁడు దొరకుటచే సంతసమును గల్గుచున్న" దనెను.

"మీరు బహుమతివిషయమై భయపడ నక్కఱలేదు. ఈరహస్యమును మీరు భేదించినట్లే ప్రచురించుకొనుఁడు. పత్రికలలో నాపేరుపడుట కిష్టములేదు. శ్యామసుందరునకుఁ గూడ నావిధాన మెఱుఁగఁజేయువఱకంతయు నగాధముగనే యుండెను. కావున మీరే దీనిని భేదించినట్లు తలఁపుఁడు."

"ఆహా! ఎంతటియౌదార్యము! కాని జనులకు నేనేమి చెప్పఁగలను? ఈరహస్యమెట్లు బయలుపడియెనో నాకుఁ దెలియదు. నే నెందుల కనుమానించితినో, ఎట్లు నాయనుమానములు దృఢపడియెనో, హంతకు నెట్లు బంధింపఁగల్గితినో—ఇట్టివిషయము లెవ్వరైన నడిగిన నేమిచెప్పఁగలను? మీప్రతిభవలన హంతకుఁడుమాత్రము దొరకినాఁడు. మువ్వురుసాక్షులయెదుట నేరముకూడ నొప్పుకొన్నాఁడు."

"అట్లయిన మీకుఁ గావలసినది రహస్యభేదనవిధానమన్నమాట. సరే! మీకును, తొలినుండి నాకుఁ దోడ్పడుచున్న యీయనంతునికి సంగతులెల్ల విశదముచేసెద! వినుఁడు.

"ఈ సుబ్రహ్మణ్యము మిక్కిలి తెలివయినవాఁడు. లుబ్ధులందఱకువలె నీతనికి ననుమానము మెండు. భార్య నెప్పుడును బాధించుచునే యుండును. కాన నామె వీనిపోరు పడలేకుండుట వింతకాదు. ఇంతలో వీరికానందుని పరిచయము కల్గెను. తనభార్యకును వానికిని సంపర్కము కలదని సుబ్రహ్మణ్యమునకు మిక్కిలి యనుమానము కలదు. కావున వారిపై కసితీర్చుకొనవలయునని యాతఁ డెంచి యుం

డెను. ఆయూహతోడ నతఁ డెట్టిపైశాచిక కృత్యమైనను జేయుటకు సిద్ధుఁడై యుండెను. మిక్కిలి తెలివితోఁ బ్రవర్తించి కార్యము నెఱవేర్చుకొనియెను; చూడుఁడు; నాతో నిటు రండు.”

ఆయింటి నెఱిఁగి యున్నవానివలెనే మధుసూదనుఁడు మమ్ములను దోడ్కొని పోయెను. ఇంటికి వెనుకఁగల వరుసగదులలో నొక గూఢమగు కొట్టుచెంతకు దీసికొని వచ్చెను.

“అబ్బ! ఎంతఘాటయిన వాసన! రంగులు కాఁబోలును?” అనుచు రామచంద్రరావు వెనుకకుఁ దగ్గెను.

“అదియే నాప్రథమసూత్రము. అనంతరావు రంగులపూఁతఁ గనిపెట్టెను గాని దాని యగత్యము నరయఁజాలఁ డయ్యెను. ఇందులకే పరిశీలనమునకుఁ దోడు పరిశోధనము కూడ నుండవలె నందును. అతఁ డిట్టిరంగుల నేలపూయుచుండవలెను? కొంచె మూహింపుఁడు. మఱియేదో వాసనను దాఁచియుంచుట కీపనిచేసినట్లు బోధపడుటలేదా? ఏదియుకానివేళ నిట్టి నిగూఢప్రదేశమున నతఁ డొనర్చు కృత్యముల కర్థమేమి? వీని నన్వయించిచూడ నేదో ఘోరము జరిగినట్లు నాకుఁ దట్టినది. పలాయితుల యుదంత మెవ్వరికిని దెలియదే! వారిసంగతి యేమయ్యెను? ఒక్కొక్కదానిని ముడిపెట్టుచుండ ననుమానము స్థిరపడుచునే యుండెను. ఇంతియేకాక నేనా నాటకశాలకుపోయి కనుఁగొంటిని. ఆరాత్రి ఇరువదినాల్గు, ఇరువదియైదు, ఇరువదియాఱు సంఖ్యల కుర్చీ లుత్తవిగనే యున్నట్లు తెలిసినది. ఇంతటితో రహస్య మిట్టిదియని బోధపడినది.

“ఇఁక మిగిలిన దేమి? ఇంటిని వెదకి మృతకళేబరములఁ గనుఁగొను టెట్లన్న ప్రశ్నము. ఇందుల కొక యబద్ధపుతంతిని సృష్టించి సుబ్రహ్మణ్యమును కళింకోట కంపితిని. తప్పించుకొని పోకుండ ననంతునిఁ బుత్తెంచితిని. ఇఁక నన్నడ్డువారు లేరని యిల్లుచొచ్చి వెదకుచుంటిని.

“ఈగదిలోనే వారి దేహములు కనఁబడినవి. అవి యొకపేటికయందు భద్రపరుపఁబడియున్నవి. నేను పరిశీలించుచుండు సమయమున నెవ్వరో వచ్చి నన్నుపట్టుకొనిరి. ఇట్లగునని నేననుకొనలేదు. కావున నిది యాశ్చర్యముఁ గొల్పెను. అట్లువచ్చిన దీ శ్యామసుందరుఁడే! ఇతఁ డానందుని బందుగులవలన నియుక్తుఁడై నిరూపణ మొనర్చుచు నింటిని వెదకవచ్చెను. నన్నుఁ జూచి దొంగయనుకొని పట్టుకొనెను. పిమ్మట పోల్చుకొని నవ్వుకొంటిమి. అప్పుడు సంగతినెల్ల నతనికి విశదపఱిచి సుబ్రహ్మణ్య మిటకు వచ్చునని పల్కితిని. అంతవఱకు వేచియుండి రాఁగానే బంధించితిమి.”

రామచంద్రరా వాశ్చర్యమొందెను. నేను మధుసూదనునిఁ గాంచి, “నాకింకనుఒకటిరెండు సందేహములు తీరుట లేదు. నాఁడు నాటకమునకుఁ బోవలసినయగత్య మాతని కేమికలదు?” అని ప్రశ్నించితిని.

“బోధపడలేదా? మొదట నానందరావు నీమిషమీఁద నింటికి రావింపఁ గల్గుట—ఇది

మిక్కిలి రహస్యముగా జరిగియుండవచ్చును. రెండవది, హత్యారహస్యము బయలుపడినను తానా సమయమున నింటలేనని చెప్పుకొనవచ్చును. కాని నీకు టిక్కట్టు చూపి యతఁడు చేయరాని పొరపాటు చేసెను."

"భార్య ధనమెత్తుకొనిపోయెనని యేడ్చినాఁడు. దాని కేమనుకొనును?"

"మఱి దొరకలేదనియైనను లేక తిరుగ పంపివేసినదనియైనను చెప్పఁగలఁడు, ఈవిషయమంత బాధించెడునది కాదుగదా!"

రామచంద్రరా వంతట, "అయ్యా! పోలీసువారమగు మా కీరహస్యము శోధింపనిచ్చుట సమంజసమే కాని తమయొద్ద కితఁ డెందుల కేతెంచెనో బోధపడదు!" అనియెను.

"మఱేమియు లేదు, సంగతులు ప్రాఁతపడినపిమ్మట 'చూచితిరా! నేనొక్క పోలీసువారి నేకాక మధుసూదనునిసైతము వేఁడికొంటిని. లాభము లేకపోయినది' యని యాతఁడు చెప్పుకొనును."

"మీ మాటలు స్వోత్కర్షములైనను శుమార్హములే! ఓహో! మీప్రతిభ వర్ణనాతీతముకదా! మధుసూదనరావుగారూ! సెలవు. మీరు మాకు మహోపకార మొనర్చితిరి. మీ కాజన్మాంతము కృతజ్ఞతాబద్ధులముకదా!"

---

## శత్రునిరాసము

బులుసు పాపయ్యశాస్త్రి గారు

కాముని( జిచ్చుఱకంటఁ జూచినవాని, సంతతయోగప్రశాంతమూర్తి
నకలంకభక్తితో నడిగినవానికి, నెనిమిదైశ్వర్యము లిచ్చువాని
జ్ఞానమే యాకారమై నివ్వటిలువాని, హస్తిదైత్యునిఁ ద్రుంచినట్టివానిఁ
దల యగల్చినపార్థు దయఁదలంచినవాని, సేవించుచున్న నన్ జేసకరాక
కామమా,నీవు దూరముగాఁదొలంగు;-క్రోధమా,విడు;లోభమా,త్రోవఁబట్టు;
మోహమా,చేరకు;మదమ్మ,ముట్టఁబోకు;మత్సరమ,యిటుసూచుటమానిమరలు.

---